క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు భక్తులు సోమవారం రూ.1,00,002 విరాళంగా అందజేశారు. బెంగుళూరుకు చెందిన సీహెచ్‌వీ ఎస్ఎస్ఆర్ రామాంజనేయులు రూ. 50,001, అలాగే సీహెచ్ సుబ్బలక్ష్మి రూ. 50,001 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఇన్‌చార్జి ఈఓ ఎం.విజయరాజు విరాళం బాండ్ పత్రాలను అందించి అభినందించారు.

సినీనటుడు సుమన్‌ను కలిసిన కుంగ్‌ఫూ విద్యార్థులు


జంగారెడ్డిగూడెంలో సినీ నటుడు సుమన్‌ను కలిసిన కుంగ్‌ఫూ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో సినీనటుడు సుమన్‌ను కుంగ్‌ఫూ మాస్టర్ గంధం సురేష్ ఆధ్వర్యంలో కుంగ్‌ఫూ విద్యార్థులు కలిశారు. పట్టణంలో జరుగుతున్న అనన్య చిత్రం షూటింగ్‌లో పాల్గొనేందుకు సుమన్ జంగారెడ్డిగూడెం వచ్చారు. ఈ సందర్భంగా తనను కలిసిన విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ కుంగ్‌ఫూ నేర్చుకోవడం వల్ల మానసిక, శారీరక వ్యాయామంతోపాటు ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలకు కుంగ్‌ఫూ నేర్పించడం వలన వారికి ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, కుంగ్‌ఫూ ఇన్‌స్ట్రక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్వాసితుల భూములకు పట్టాలు ఇవ్వాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పంపిణీ చేసిన భూమికి భూములకు పట్టాలివ్వాలని కోరుతూ సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఎస్‌కే గౌసు మాట్లాడుతూ వేలేరుపాడు మండలం చాగరపల్లి, కొర్రాజులగూడెం, చిగురుమామిడి, కాచారం, తదితర గ్రామాలకు చెందిన నిర్వాసితులకు బుట్టాయగూడెం మండలం తాడితోట, ముప్పినవారిగూడెం, దొరమామిడి, గుర్రప్పగూడెం గ్రామాల్లో భూమికిభూమికి సంబంధించి కేవలం హక్కు పత్రాలు మాత్రమే ఇచ్చారని చెప్పారు. దీనికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకాలతోపాటు వాటి వివరాలు నమోదు చేయకుండా అధికారులు కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎస్.శారా శాంతికి అందజేశారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత


ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

లింగపాలెం : ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం గ్రంథాలయ కమిటీ సభ్యులు బీవీఎన్ ప్రకాశరావు, కె చిట్టియ్య, నాగజ్యోతి చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవీ నారాయణ, పి.ప్రభావతి, ఆర్.సరళకుమారి, 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం


విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు గాంధి తదితరులు

ద్వారకాతిరుమల: రాష్ట్ర, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలలోని వసంత్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత ఫిజికల్ ఫిట్‌నెస్(ఇండోర్ రోయింగ్) శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డు డైరెక్టర్ అంబటి గాంధి, వైఎస్సార్ సీపీ నాయకులు రుద్ర శివాజీ, అంబటి శివాజీ, కోచ్ ఊదర్ల విజయ్ శిక్షణ పొందిన సుమారు 85 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, గోల్డ్, సిల్వర్, బ్రౌన్ మెడల్స్‌ను అందజేశారు. కోచింగ్ క్యాంప్ ఏర్పాటుకు కృషి చేసిన విజయ్‌ను పలువురు అభినందించారు.

విద్యారంగానికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన చేపట్టినప్పటి నుంచి విద్యారంగానికే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే 4,657 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో నాడు–నేడు కార్యక్రమంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియంను అందిస్తున్నారన్నారు. విద్యార్థుల చదువులకు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డి.సుబ్బారావు, ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, కామవరపుకోట సర్పంచ్ కరిపోతూ అనూష, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పందు జగదీష్ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్‌బాబు, నానాది సాగర్, ఎంపీటీసీ బోల్లువెంకట సత్యనారాయణ, కోఆప్షన్స్ సభ్యులు ఎస్కే కరీముల్లా, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కామవరపుకోట : జెడ్పీ హైస్కూల్‌లో విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


బుట్టాయగూడెం : విద్యార్థిని ఆశీర్వదిస్తున్న పోలవరం ఎమ్మెల్యే బాలరాజు

విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ అందించడమే లక్ష్యం

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదని భావించి సీఎం జగన్ అమ్మ ఒడి పథకం ద్వారా నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు జమ చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడంతోపాటు జగనన్న విద్యాకానుక, గోరుముద్దలు వంటి మంచి పథకాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కొవ్వాసి నారాయణ, సచివాలయాల కన్వీనర్‌లు తెల్లం సింహాచలం, తహసీల్దార్ ఎస్. శారా శాంతి, ఎంఈఓ టి. బాబూరావు, హెచ్ఎమ్ గంగాదేవి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

లింగపాలెం : ప్రతి పేదవారికి విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని మండల పరిషత్ ఉపాధ్యక్షులు మట్టా సురేష్‌బాబు అన్నారు. శింగగూడెం హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను సురేష్, వైఎస్సార్ సీపీ నేతలు పంపిణీ చేశారు. సురేష్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 4,293 మందికి టెస్ట్ బుక్స్, యూనిఫాం షూ,బెల్టులు, సాక్స్‌లు, నోట్ బుక్స్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. బాలికల యూనిఫాం, బ్యాగ్‌లు రావల్సి ఉందని అవి రాగానే విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, హైస్కూల్ కమిటీ చైర్మన్ యాదాల వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కోటగిరి ధీరాజ్ కృష్ణ, కోటగిరి హరీష్, రావి కొండయ్య, కొప్పుల వెంకటేశ్వరరావు, శావా రాజేష్, మందలపు నరిశింహారావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : విద్యార్థుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేబడుతోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. శ్రీనివాసపురంలో ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోల్నాటి నాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక దేశానికే ఆదర్శం

కొయ్యలగూడెం: జగనన్న విద్యా దీవెన పథకం దేశంలోని విద్యా వ్యవస్థకు ఆదర్శంగా నిలిచిందని, ఇది పేద విద్యార్థులకు ఒక వరం అని ఎంపీపీ గంజిమాల రామారావు పేర్కొన్నారు. కొయ్యలగూడెంలోని పలు ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కిట్లను విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జె.సురేష్‌బాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 53 ప్రభుత్వ విద్యాసంస్థలలోని 6,073 విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. వీరికి రూ.1,46,90,587 విలువైన విద్యా సామాగ్రిని అందజేశామన్నారు. గవరవరం, పరింపూడి హైస్కూల్‌లో జగనన్న విద్యా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంటా శ్రీనివాస్, బిరుదుగడ్డ రత్నకుమారి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే బాజీ, వైఎస్సార్ సీపీ కన్వీనర్ సీమకుర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోందన్నారు. ఇప్పటికే నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరీకరించారన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం రోజే విద్యార్థులకు ఈ కిట్లను అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రుద్ర శివాజీ, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, అచ్యుత జగన్మోహిని, పాఠశాల హెచ్ఎం ముత్యాలరావు

విద్యార్థులకు పుస్తకాల అందజేత

పోలవరం రూరల్ : పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ అందజేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయాలని ఈ సందర్భంగా ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో బీఎస్ స్వరూప్, పొడుం శ్యామ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు


కుక్కునూరు : విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నరసింహరాజు

కుక్కునూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పేర్కొన్నారు. సోమవారం కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నరసింహరాజు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం అందించడంతోపాటు వారి భవిష్యత్తు కోసం రూ.వేల కోట్లు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ గెంటేలా నరిసింహరావు, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రావు వినోద్, మల్లేల చంటినాయుడు, సూర్ల రాము తదితరులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో విద్యా కానుక కిట్లను అందజేస్తున్న జెడ్పీటీసీ బాబ్జి


లింగపాలెం : శింగగూడెం హైస్కూల్‌లో జగనన్న కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం : హైస్కూల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రామారావు


పోలవరం రూరల్ : పోలవరం ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి


ద్వారకాతిరుమల : ఎంపీయూపీ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌ను అందజేస్తున్న సర్పంచ్

యర్రమిల్లికి పురస్కారం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ ఆలయ ప్రధానార్చకులు, కొయ్యలగూడెం మండల శ్రీశ్రీశ్రీరాజరాజేశ్వరి త్రిశక్తి పీఠం వ్యవస్థాపకులు యర్రమిల్లి మనోజ్‌శర్మకు అగ్నిమంథన్ పురస్కారం లభించింది. ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్, అమెరికా ఇన్‌క్, ఇండియన్ ఛాప్టర్ ఆర్గనైజేషన్ వారిచే ఈ నెల 11న ముంబైలో ప్రతిష్టాత్మక అగ్నిమంథన్ – 2023 జ్యోతిష్య సభ నిర్వహించారు. ఈ సభలో జ్యోతిష్య శాస్త్రంలో విశేష ప్రతిభ చూపుతున్న మనోజ్ శర్మకు గౌరవ డాక్టరేట్, అంతర్జాతీయ ప్రముఖ జ్యోతిష్కునిగా జీవితకాల సభ్యత్వం, జ్యోతిష్య చక్రవర్తి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మనోజ్ శర్మను నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులతో పాటు పట్టణ ప్రముఖులు అభినందించారు.

జీపుజాత యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కొయ్యలగూడెం : సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే జీపు జాతయాత్రను విజయవంతం చేయాలని కొయ్యలగూడెం ప్రధాన సెంటర్లో సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జీపు జాత యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 12 నుంచి 26వ తేదీ వరకు సీపీఐ నిర్వహిస్తున్న జీపు జాత యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, వెలగల రామారావు, ఎస్ గిరి, మట్ట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'గడపగడపకు'


కొయ్యలగూడెం : అంకాలగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మమేకమైన పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


కామవరపుకోట : కొత్తూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

కొయ్యలగూడెం : అంకాలగూడెంలో సోమవారం సర్పంచ్ కడకట్ల గడ్డియ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఈ కార్యక్రమానికి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ విధానాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీజేపీ నేతలు వారి పాలనలో ఉన్న రాష్ట్రాలలో సంక్షేమ పథకాలను ఎందుకు ప్రవేశపెట్టలేకపోయారన్నారు. కేంద్రం తన జేబులో నిధులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని, రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లిన నిధులలో మనకు దక్కాల్సిన వాటాను మంజూరు చేస్తున్నారన్నారు. పచ్చకామెర్ల దళానికి మతోన్మాద కాషాయదళం తోడైనా వారితో అప్రజాస్వామ్య శక్తులు కలిసినా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో మారు ఏర్పడబోతోందని బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. గడపగడప కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలు పరిష్కారమవుతుండంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డడి నాగేశ్వరరావు, ఎంపీపీ గంజిమాల రామారావు, అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ గంటా రాంబాబు, ఎంపీటీసీ జాన్ డేవిడ్ కింగ్, మండల కో–కన్వీనర్ తాడిగడప రామకృష్ణ, తహసీల్దార్ పాశం నాగమణి, ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి, సీఐ విజయబాబు, ఎస్సై జీజే విష్ణువర్ధన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఇంటికే సంక్షేమ పథకాలు

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన వారికి నేరుగా ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. సోమవారం మండలంలో కొత్తూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తూ బ్రోచర్లు అందజేశారు. ప్రధాన రహదారిలో ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి చెక్‌పోస్ట్ వరకు డ్రెయినేజీ వ్యవస్థ లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే ఎలీజాకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరలా విజయఢంకా మోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పందు జగదీష్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, ఎంపీటీసీలు బోల్లు వెంకట సత్యనారాయణ, తమ్మిశెట్టి గిరిజ, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే కరీముల్లా, గ్రామ సర్పంచ్‌లు కరిపోతు అనూష, దేవరపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


బడి పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సి మధుబాబు

చింతలపూడి : బడి పిల్లలను పనికి పంపకుండా బడికి పంపించాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం భట్టువారిగూడెం లిబర్టీ చిల్డ్రన్స్ హోంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ల వయస్సు ఉన్న బాల, బాలికలందరూ చదువుకోవాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు దూరంగా ఉంచాలని హెచ్చరించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తామని చెప్పారు. నిర్బంధ విద్యా హక్కు చట్టం ద్వారా ప్రతి బాలుడు, బాలిక చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కొవ్వూరి కనక దుర్గా భవాని, సోషల్ వర్కర్ అక్బర్ ఆలి, ఐసీడీఎస్ పీఓ మాధవి, వార్డెన్ హిజ్కియ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : అంతర్జాతీయ బాల కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని లక్కవరం సచివాలయం వద్ద సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు బాల కార్మిక నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లలోపు బాలబాలికలచే పనులు చేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు, కార్యక్రమంలో లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏవీవీ భువనేశ్వరీ, న్యాయవాదులు మాదేపల్లి నాగు, దాకారపు ప్రసాద్‌బాబు, దగ్గ కృష్ణ, బల్లే సాయికుమారి, వలంటీర్లు పాల్గొన్నారు.

నాడు–నేడుతో విద్యాభివృద్ధికి నూతన ఉత్తేజం


ఎంపీపీ (మెయిన్) పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం : నాడు – నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, విద్యాభివృద్ధికి నూతన ఉత్తేజం అని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. బుట్టాయగూడెం రోడ్‌లో ఉన్న ఎంపీపీ (మెయిన్) పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు–నేడు పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలను నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసేందుకు రూ. 19లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇప్పటివరకు 95 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కౌన్సిలర్ మేకా రమాదేవి, సుబ్రహ్మణ్యం మధ్యాహ్న భోజనం నిమిత్తం వంట స్టౌవ్‌ను అందజేశారు.

వినతులు స్వీకరించిన మునిసిపల్ కమిషనర్

మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సుబ్బంపేటకు చెందిన చిన్ని శ్రీను, చిన్ని రమేష్ రహదారి సమస్యను విన్నవించారు. మున్సిపల్ రోడ్డుని పోలిన శ్రీనివాసరావు అనే వ్యక్తి ఆక్రమించుకుని తమకు నడకదారి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిస్కరిస్తామని హామీ ఇచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత


మంగ కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : గత ఏడాది వైద్యం వికటించి మృతిచెందిన కబడ్డీ క్రీడాకారిణి మొడియం మంగ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్‌ను క్రీడాకారిణి తల్లి మొడియం వెంకమ్మకు సోమవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతులమీదుగా అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు మంగ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యానికి సహాయం


ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఏలూరులో వైద్యం పొందుతున్న బంధం నవీన్ వైద్యచికిత్స నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నవీన్‌కు మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూదేవి పండుగ

గిరిజన ప్రాంతంలో భూదేవి పండుగ వేడుకలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఐటీడీఏ ఉద్యోగుల క్వాటర్స్‌లో, కృష్ణాపురం గ్రామంలో పండుగను వైభవంగా జరుపుకోగా మిగిలిన గ్రామాల్లో కూడా పండుగ హడావిడి మొదలైంది. సోమవారం వీరన్నపాలెం వద్ద భూదేవి పండుగ వేడుకల్లోఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని గిరిజన సంప్రదాయ రేలపాటలకు నృత్యాలు చేసి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరికి ముందు భూదేవి పండుగ జరుపుకుని అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభించడం ఆనవాయితీ అని అన్నారు.

బురదనీరు సరఫరాతో ఇక్కట్లు

ద్వారకాతిరుమల: స్థానిక తూర్పు వీధిలో మంచినీటి కుళాయిల నుంచి గత నాలుగు రోజులుగా బురదనీరు సరఫరా అవుతోంది. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కనీసం వాడుకకు కూడా పనికిరాని విధంగా నీరు వస్తోందని, తాము నీటి కష్టాలను తాళలేక పోతున్నామని అంటున్నారు. దీనిపై పంచాయితీ కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా మంచినీటి బోరు మరమ్మతులకు గురైందని, దాంతో మరో 70 అడుగుల లోతు పెంచాల్సి వచ్చిందన్నారు. దాని కారణంగా బురదనీరు వస్తోందని, మూడు నాలుగు రోజుల్లో సమస్య పూర్తిగా తొలగిపోతుందని పేర్కొన్నారు.


తూర్పు వీధిలో ఒక ఇంటి వద్ద కుళాయి నుంచి వస్తున్న బురద నీరు